# బంధాలు - అనుబంధాలు

"హలో మావయ్యా..."

మధుర స్వరం! గుండెల్ని తడిమిన ఆప్యాయత!

"నువ్వా మంజూ! ఏం చేస్తున్నావు..."

"మా ఇంజినీరింగ్ కాలేజీలోనే ల్యాబ్ ఇన్‌చార్జ్‌గా చేస్తున్నాను..."

"మీతో వచ్చిన చిక్కే ఇది. మీకు తోచదు. నాబోటి వాళ్ళని అడగరు. హైదరాబాదెళ్ళి కంప్యూటర్ కోర్సులు చేస్తే సాఫ్ట్‌వేర్ సంస్థలు కళ్ళకద్దుకుని తీసుకునేవిగా! ముందు కెళ్ళాలనుకునే వాళ్ళెవరూ కాళ్ళకి తీగలు అడ్డం పడ్డాయని ఆగిపోరు. ఆగితే గొప్ప కెరీర్ని మిస్సయినట్టే. గతం కన్నా భవిష్యత్తు ముఖ్యం. ఆప్తుల కన్నా ఆస్తులు ముఖ్యం, గుర్తుంచుకో. అద్సరే - ఇప్పుడెందుకు ఫోన్ చేసినట్టు?"

"అమ్మ అక్కడికి వస్తోంది. బావకి నన్ను చేసుకోమని అడగటానికి. వీలు పడదని చెప్పెయ్ మావయ్యా..."

ఉలిక్కి పడ్డాను. "అదేవిటి?"

"అమ్మ పిచ్చిది మావయ్యా. ఇంకా సత్తెకాలంలోనే వుంది. ఇవాళ రేపు ప్రపంచం ఎంతగా మారిపోయిందో తనకి తెలీదు. చెబితే అర్థం చేసుకోదు. భూమికీ ఆకాశానికీ లంగరందదంటే వినదు..."

మనస్సులోతుల్లో సంతోషపు అలలు చిన్నగా ఎగిసిపడ్డాయి.

"చదువుకున్న దానివన్పించుకున్నావ్. పరిస్థితిని చక్కగా అంచనా వేశావు..."

"బావకి లక్షల కట్నం ఇస్తామంటూ సంబంధాలొస్తుంటాయి. వాటిని కాదని అణాకానీ సంబంధం చేసుకోమని మీరూ చెప్పలేరు కదా..."

"అవునవును. సిరిరా మోకాలొడ్డలేం కదా. పైగా కయ్యానికైనా వియ్యానికైనా సమఉజ్జీ వుండాలన్నారు..." గొప్పగా చెప్పాను.

"అమ్మ బాధపడకుండా ఏదో చెప్పి నచ్చచెప్పి పంపెయ్ మావయ్యా... నేనిలా ఫోన్ చేసినట్టు అమ్మకి తెలీనివ్వొద్దు. వుంటాను....."

రిసీవర్ పెట్టేస్తోంటే కాఫీ కప్పుతో వచ్చింది మా ఆవిడ సీత.

"సంబంధం కదపడానికి మా చెల్లెలు సుబ్బు వస్తోందిట...."

బుగ్గలు నొక్కుకుంది. "తలచెడిన మనిషి పెళ్లి పూసెత్తడానికి తగుదునమ్మా అని వస్తోందా! పంపటానికి అయిన వాళ్ళే కరువయ్యారా!"

మనస్సు చివుక్కుమంది. "అదేం మాటే. ఎంతైనా తోడబుట్టింది"

"అలా అని నెత్తికెక్కించుకుంటారేమో ఇదిగో ఇప్పుడే చెబుతున్నాను. ఆవిడ బుడిబుడి దీర్ఘాలు తీసిందని బుట్టలో పడితే కాదు. నా కొడుక్కి మీ చెల్లెలి కూతుర్నిచ్చి చెయ్యడానికి నేను ససేమీరా ఒప్పుకోను" తెగేసి చెప్పింది.

"నేనెందుకు ఒప్పుకుంటానే పిచ్చిదానా. ఆ రోజుల్లోనే కట్నం తక్కువని మేనరికాలు మంచివి కావనే వంకపెట్టి మావయ్య కూతుర్ని కాదని నిన్ను చేసుకున్నానూ! మనిషికి ఉన్నది పుష్టి-గొడ్డుకి తిన్నది పుష్టి అన్న సూత్రాన్ని జీర్ణించుకుని అక్షరాలా అమలు చేస్తున్న వాణ్ణే..."

"లక్షల కట్నం ఇవ్వాలి. అమ్మాయి నిలువెల్లా బంగారంతో మెరిసిపోవాలి. అలాటి సంబంధమే చేద్దాం"

మరో గంటకి రెండు చేతుల్తో రెండు సంచులు మోస్తూ వచ్చింది సుబ్బు.

"బాగున్నావా అన్నయ్యా" నోరారా పలకరించింది.

ఆత్మీయ 'స్పర్శ'కి నాకు తెలీకుండానే కళ్ళు చెమర్చాయి.

"బాగానే వున్నాను గాని నువ్వెలా వున్నావు. మంజు ఏం చేస్తోంది...."

"చదివిన కాలేజీలోనే చేస్తోంది. నెలకి పదివేల దాకా ఇస్తున్నార్లే అన్నయ్యా..."

"ప్రసాదానికే తృప్తిపడిపోతే ఎలాగే. హైదరాబాదెళ్తే విందు భోజనం దొరుకుద్దిగా!"

"నన్ను విడిచి వెళ్ళనంటోంది..."

"మనకన్నా దాని భవిష్యత్తు ముఖ్యమే"

"నిజమే కాని అది విన్పించుకోవడం లేదు. నచ్చ చెప్పడానికి ఎవరున్నారు చెప్పు? కన్నబిడ్డకి చేయి అందించాల్సిన సమయంలో మా చేయి వదిలేసిపోయాడు ఆ మహానుభావుడు – ఏ లోకాల్లో వున్నారో ఏమో...!" కన్నీళ్లు పొంగి రాగా చీర కొంగుతో ఒత్తుకోసాగింది.

"నట్టింట కన్నీళ్ళేవిటీ!" వికారంగా మొఖం పెట్టి కసిరినట్టుగా అంది సీత.

"ఏవిటో ఆయన వూసొచ్చేసరికి ఆగలేదు వదినా..." గబగబా కళ్ళు తుడిచేసుకుంది.

"బావ అర్ధాయుష్కుడు కాకపోయి వుంటే ఇవాళ మీరు నువ్వా నేనా అన్నట్టుండే వారు..."

"తక్కువ నోములు నోచి ఎక్కువ ఫలం కావాలంటే వస్తుందా అన్నయ్యా"

"అసలదంతా నీ తప్పే. అవాళ ఆ సంబంధం చేసుకోవద్దన్నాను. కుర్రాడు బుద్ధిమంతుడే గాని వెనకాల ఆస్తి పాస్తులేం లేవన్నాను. నా మాటెవరైనా విన్పించుకుంటే కదా. నాన్నతో బాటు నువ్వూ తెయ్ మంటూ ఊరేగేవు. అన్నయ్య చెప్పేదు విందామని నువ్వూ అనుకోలేదు" నిష్ఠూరంగా అన్నాను.

"తండ్రి చాటు బిడ్డని. నాన్నని కాదనెలా అనగలను చెప్పు? పైగా తెలిసీ తెలీని వయస్సు. మృత్యువు లారీ రూపంలో వచ్చింది గనుక ఇలా దిక్కూ మొక్కూ లేని వాళ్ళం అయిపోయాంగాని...ఏ మాటకామాటే చెప్పుకోవాలి. ఉన్నన్నాళ్ళూ మమ్మల్ని పువ్వుల్లో పెట్టుకునే చూశారు"

ప్లేటులో అప్పడాలు, పూతరేకులు, సన్న కారప్పూస, నాలుగు పనస తొనలు పెట్టిచ్చింది సుబ్బు.

"నీకెంతో ఇష్టమని పూతరేకులు నేనే చుట్టి తెచ్చానన్నయ్యా. అప్పడాలూ కారప్పూసా నేను చేసినవే....." సంబరంగా చెప్పింది.

"అమృతంలా వున్నాయి" అన్నానో లేదో చెల్లెలు మొహం వికసించింది.

భోజనాలయ్యాక ముగ్గురం హాల్లో టీవీ ముందు కూర్చున్నాం.

"నాన్న అయినా అన్న అయినా నువ్వే కదా అన్నయ్యా. అండగా నిలవడానికి నాన్నలేడు. నువ్వే కొండంత అండగా నిలబడతావన్న ఆశతో వచ్చాను..." గాద్గదిక స్వరంతో అంది.

"దేనికైనా కొండలా నిలబడ్తారు. అలాగని మా ఇంటితో ముడి పెట్టకు. మాకు ఒక్కగానొక్క బిడ్డ. మాకూ కోటి ఆశలుంటాయి!" చటుక్కున అంది సీత.

ఎదురుదెబ్బ తగిలినట్లు చూసింది. అంతలోనే తమాయించుకుంది.

"ఎవరి బిడ్డమీద ఎవరికి ఆశలుండవు వదినా. నా రాత కాలింది గనుక ఇలా వచ్చి చెంగు చాచి అడుగుతున్నాను. నా పరిస్థితి నీకు తెలుసు కదా అన్నయ్యా. ఆయన

పోయాక బిడ్డని ఎలా పెంచానో ఎన్ని కష్టాలు పడ్డానో ఆ భగవంతుడికే తెలుసు. ఎవర్నీ దేహీ అని అర్థించకుండా పెంచాను. మంజు కూడా కష్టం సుఖం తెలుసుకుంది. ఇంజినీరింగులో సీటు తెచ్చుకుంది. నా తలకు మించిన భారమైనా నీ బోటివాళ్లు వారించినా సరే కాలేజీలో చేర్చాను. నా కష్టం ఫలించింది. మంజు ఇంజినీరయ్యింది. నాకు నీడ నిచ్చే చెట్టయ్యింది..."

"నువ్వు దాని గురించేం దిగులు పడకు. రెక్కల్ని నమ్ముకున్న వాళ్ళు తప్పకుండా వృద్ధిలోకొస్తారు..."

"నీ నోటి చలవన అది చల్లగా వుంటే అంతే శాన. మంజుని నీ కడుపులో వేసుకో అన్నయ్యా!" కళ్ళలో తడి పొర కదలగా కంపిత స్వరంతో అంది.

"నలుగురు పిల్లలుంటే అలాగే చేసుకుందుం. ఒంటికాయ శొంఠికొమ్ములా ఒక్కగానొక్కడాయె. వాడికీ అచ్చటా ముచ్చటా తీరాలి కదా!" నేను నోరు తెరిచేలోగా అనేసింది సీత.

"ఉన్నంతలో దేనికీ లోటు చెయ్యను వదినా. ఆయన తాలూకు పొలమూ ఇల్లూ అంతా దానికే కదా. పంచుకోడానికింకెవరున్నారనీ!"

"అది కాదు సుబ్బూ. పెద్ద పెద్ద ఆఫీసర్ల సంబంధాలు వస్తున్నాయి. లక్షలిస్తామంటున్నారు. వచ్చేది పాడు చెయ్యలేం గదా! ఆల్రెడీ రెండు మూడు నలుగుతున్నాయి. వారం పది రోజుల్లో నిశ్చయం చేసేస్తాను. పైగా బాలాజీకి మంజుని చేసుకోవడం ఇష్టం లేదు..."

"అదేవిటి! నేను ఫోన్ చేసి అడిగితే అంతా అమ్మా నాన్నల ఇష్టం అన్నాడే!"

సుబ్బు మాటలకి నేనూ మా ఆవిడా కంగు తిన్నాం. మొఖామొఖాలు చూసుకుని, 'అమ్మ దేవాంతకురాలా! అట్నించి నరుక్కు రావాలని చూశావన్న మాట!' అనుకున్నాం.

"చిన్నప్పుడు నువ్వెత్తుకుని మోసినవాడు. నువ్వడిగితే అలా గాక ఇంకెలా చెబుతాడు చెప్పు. నాతో అన్ని విషయాలూ మాట్లాడాల్లే..."

"నా ఆశ చెప్పేను. నోరు తెరచి అడిగాను. నన్ను పాల ముంచుతావో నీట ముంచుతావో నీ ఇష్టం అన్నయ్యా" దిగాలుగా పలికింది సుబ్బు.

"భలే దానివేనే. సంబంధం కలుపుకోనంత మాత్రాన మీరు పరాయి వాళ్లయిపోతారేవిటి. నేను మంజుకి మేనమావని. నా బాధ్యత నేను నిర్వర్తిస్తాను. చక్కని

సంబంధం చూసి చేద్దాంలే"

"నా మొఖం చూసి చెప్పన్నయ్యా. నువ్వు నా చేయి వదిలేస్తావా?" బేలగా అడిగింది.

"అవేం మాటలే సుబ్బూ. మంజుని చేసుకోనంత మాత్రాన అన్నాచెల్లెళ్ల బంధం తెంచేస్తే పుటుక్కున తెగి పోయేదా చెప్పూ. అన్ని బంధాలకన్నా రక్త సంబంధం చిక్కన అన్నారు" అంది సీత.

"నువ్వేం బెంగపెట్టుకోకు. బాలాజీ పెళ్లవ్వగానే మంజుకి చక్కని సంబంధం చూసి చేసే బాధ్యత నాది. సరేనా?"

ముఖంలో విషాద ఛాయలు అలుముకోగా తనలో తను అనుకున్నట్టుగా అంది "ఇంటికొచ్చి అర్థించిన ఆడబడుచుని వట్టి చేతుల్తో పంపుతావనుకోలేదు..."

"మరీ లోకజ్ఞానం లేనట్టు మాట్లాడతావేంటి సుబ్బూ. మనమేమిటో మన తాహతేమిటో మరచిపోతే ఎలా. ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికెగరాలనుకోకూడదు" అసహనంగా అన్నాను.

"అక్కడకీ వెళ్లొద్దని మంజు చెబుతూనే వుంది. నేనే పిచ్చిదాన్ని. ప్రేమాభిమానాలుంటాయని పాకులాడుతూ పరుగెత్తుకొచ్చాను!"

"అభిమానాలంటే ఏవిటో ఆప్యాయతలంటే ఏవిటో మాకూ తెలుసులేమ్మా. నువ్వేం దెప్పి పొడవక్కర్లేదు!" చేతులు తిప్పింది సీత.

"ఇంకా విషయం వదిలేసెయ్యండి" రాని ఆవలింతలు తెచ్చుకుంటూ లేచాను.

నిజానికి నాకు ఎక్కువ మాట్లాట్టం రాచుకు పూచుకు తిరగటం నచ్చదు.

నేను, మా ఆవిడ, మా అబ్బాయి, మా ఆస్తులు - ఇదే మా లోకం! 'నన్ను ముట్టుకోకు నామాల కాకి' అన్నట్టు ఉంటానని బంధుజనం వెక్కిరించినా పట్టించుకోను.

సుబ్బు సంబంధం కదిపిన వేళావిశేషం వల్లనో ఏమో మరి రెండ్రోజులు తిరక్కుండానే ఏసిటీవో సూర్యనారాయణ సంబంధం వచ్చింది.

వాళ్ళకీ మాకూ మధ్య గంట ప్రయాణం. బీరకాయ పీచు బంధుత్వం. అతడు రెండు చేతుల్తో సంపాదించాడు. సంపాదిస్తున్నాడు. ఇంకా సంపాదిస్తాడు. బినామీ పేర్ల మీదే బోల్డు ఆస్తులున్నాయిట!

అమ్మాయి శుభశ్రీ కుందనపు బొమ్మలా వుంది. మాకూ బాలాజీకీ అన్ని విధాలా

నచ్చింది. వెంటనే నిశ్చయ తాంబూలాలు తీసుకుని ముహూర్తాలు పెట్టేసుకున్నాం.

"సుబ్బూ! బాలాజీకి సంబంధం కుదిరిందే...వచ్చే నెల రెండో తారీఖునే పెళ్ళి. నాకు ఆఫీసులో ఆడిటింగ్ జరుగుతోంది. అంచేత నేను స్వయంగా వచ్చి పిలిచాననుకుని పెళ్ళికి పదిహేను రోజులు ముందే వచ్చి అన్నీ చక్కబెట్టాలి. నువ్వున్నావన్న ధీమాతో దగ్గర్లోని ముహూర్తం ఖాయం చేశాను..."

"నువ్వింతగా చెప్పాలా అన్నయ్యా. మనింట్లోని పెళ్లి. నేనూ మంజూ వచ్చి అన్నీ చూసుకుంటాంలే. వదిన్ని ఆదుర్దా పడొద్దని చెప్పు"

మర్నాడే సుబ్బు వచ్చేసింది. పప్పులూ ఉప్పులూ కొని బాగు చేసింది. అరిసెలు వండింది. సున్నుండలు సిద్ధం చేసింది. పెళ్లి రెండ్రోజులుందనగా మంజు వచ్చింది. బాలాజీ బట్టలు సర్దటం, ఇస్త్రీ చెయ్యటం వగైరా వాడి పనులు ఉత్సాహంగా చక్కబెట్టింది.

బాలాజీ మంజూ నవ్వుతూ కబుర్లు చెప్పుకొంటోంటే చిలకా గోరింకలు గుర్తొచ్చాయి. ఉత్తర క్షణాన ఆ ఆలోచనని చిదిమేశాను.

పెళ్లి ఘనంగా జరిగింది. బంధుమిత్రులూ మా ఆఫీసు వాళ్లూ అంతా వచ్చారు. ఈడూ జోడూ బాగుందని మెచ్చుకున్నారు. నెలలోనే శుభని కాపురానికి తీసుకెళ్తామని చెప్పాం. మొదట మా ఇంటికి తీసుకొచ్చింతర్వాత అబ్బాయి పని చేస్తోన్న పూణె పంపిస్తామన్నాం.

"చాలా సామాన్లు కొన్నాం. అటూ ఇటూ తిరగటం ఎందుకూ ఏకంగా పూణే పంపేస్తాం" అన్నాడు వియ్యంకుడు.

అయిష్టంగానే అంగీకరించాం. కోడల్ని వేమే తీసుకెళ్లి కొత్త కాపురం పెట్టిద్దామనుకున్నాం. అందుకన్ని ఏర్పాట్లూ చేసుకున్నాం.

కాని, "ఆంటీ అంకుల్ శుభని తీసుకొచ్చి దిగబెట్టాలని ఉత్సాహపడుతున్నారు డాడీ. మీరు తర్వాత వద్దురుగాన్లే" అన్నాడు బాలాజీ.

మా ఉత్సాహం నీరు కారిపోయింది. పెదాలకి చిరునవ్వు అంటించుకుని వాళ్ళందర్నీ రైలెక్కించి కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి వచ్చాం.

"అబ్బాయిని మనకి దూరం చేస్తారేమోనని భయంగా వుందండీ..." మెల్లగా చెప్పినా సీత కళ్ళనిండా దిగులు, భయం పరుచుకున్నాయి.

"నీ పిచ్చిగాని దూరం చేస్తే దూరమై పోతారేంటి. వాడు మనబ్బాయి. మన

వంశోద్ధారకుడు. ఆ సంగతి మర్చిపోకు..."

పైకి సర్ది చెప్పేను గాని నాలోనూ ఏదో తెలీని అశాంతి, ఆందోళన నూతినీళ్ళలా ఊరుతున్నాయి.

ఆఫీసులో ఆడిటింగ్ వాళ్ళు చాలా లొసుగులు ఎత్తి చూపారు. నా అవినీతి డొంక కదుల్తుందేమోనని భయభ్రాంతుడ్నయ్యాను.

భయాలూ టెన్షన్లూ - ఎన్నో! అవి సర్దుకునే సరికి తలప్రాణం తోకకొచ్చింది. దానాదీనా నా ఆరోగ్యం దెబ్బతింది. బీపీ హెచ్చింది.

ఒకరోజు రాత్రి అకస్మాత్తుగా కాళ్ళూ చేతులూ బరువెక్కాయ్. సీతని పిలవాలనుకున్నాను. మాట సరిగ్గా రాలేదు. ఎప్పటికో లేచింది సీత. నా పరిస్థితి చూసి లబోదిబోమంది. ఇరుగు పొరుగు సాయంతో ఆసుపత్రిలో చేర్చారు.

పక్షవాతం వచ్చింది. ఎడమవైపు భాగం బాగా ఎఫెక్ట్ అయ్యింది. ఎడం చెయ్యీ కాలూ స్వాధీనంలో లేవు. మూతి ఓ పక్కకి లాగెయ్యడంతో మాట స్పష్టత కోల్పోయింది.

అతికష్టం మీద "సుబ్బు.. ఫోను..." అని చెప్పేను.

ఫోనందగానే కట్టు బట్టల్తో వచ్చేశారు సుబ్బూ, మంజూ.

ఒకరు ఇంటికి, రెండోవారు ఆసుపత్రికీ అంకితమై పోయారు.

నాలుగు రోజులు పోయాక బాలాజీ, శుభ, సూర్యనారాయణ, వియ్యపురాలు వచ్చారు.

అబ్బాయి రిపోర్టులు చూచి డాక్టర్లతో మాట్లాడాడు.

"వర్రీ అవ్వాల్సిన పనిలేదన్నారు డాడీ. ట్రీట్‌మెంట్‌కి రెస్పాన్స్ బావుందిట. ఇంకో వారం రోజుల్లో డిశ్చార్జి చేస్తామన్నారు. ఒన్ మంత్ దాకా మస్సాజ్‌లూ ఎక్సర్‌సైజులూ అవీ చేస్తే చాలట. ఫిజియోథెరపిస్టుని ఇంటికి పంపే ఏర్పాటు చెయ్యమన్నాను. చేస్తానన్నారు. ఎంత డబ్బు ఖర్చైనా ఫర్లేదు కాస్ట్‌లీ వైద్యం చెయ్యమని చెప్పేను. మీరేం దిగులు పడొద్దు. త్వరలోనే కోలుకుని ఆఫీసు కెళ్ళిపోతారు"

వాడి మాటలెంతో వూరట కల్గించాయి. కుడిచేత్తో వాడి భుజాన్ని తట్టాను.

"ఇంటికెళ్దాం పదండి..." సీత మాటలకి ఇబ్బందిగా చూశారు కొడుకూ కోడలూ.

"మా డాడీ కార్లో వచ్చాం. వెళ్ళిపోవాలి ఆంటీ. ఎల్లుండు హైదరాబాదులో మా చిన్నాన్నగారబ్బాయి పెళ్లి. అది చూసుకుని అట్నుంచి పూణె వెళ్లిపోతాం" కోడలంది.

చుట్టపు చూపుగా వచ్చి వెళ్లి పోయారు.

భరించరానంత శూన్యం ఆవరించగా అచేతనంగా వుండిపోయాను.

"అంత దూరాన్నుంచి వచ్చారు. ఇంట్లో చెయ్యి కడుక్కోకుండా ఎలా వెళ్లనిచ్చావు వదినా" అంది సుబ్బు నిష్ఠూరంగా.

జవాబివ్వడానికి మా దగ్గర మాటల్లేవు!

నా ఆరోగ్య పరిస్థితి మెరుగు పడింది. అడుగుల వెయ్యగల్గుతున్నాను

ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశాక మంజు వెళ్లిపోయింది. ఉన్నంత కాలం తనే ఎక్సర్‌సైజులు చేయించింది. తర్వాతాపనికి ఫిజియోథెరఫిస్టు వచ్చాడు కాని అతడు వేళకి రావట్లేదని చెప్పి సుబ్బు చేయిస్తోంది.

పూర్తిగా నయమై ఆఫీసుకెళ్లే స్థితికి రావడానికి నెలన్నర పట్టింది,

"కంటికి రెప్పలా చూసుకున్నారు తల్లీ కూతుళ్ళు. మీ ఋణం తీర్చుకోలేను" గుండె లోతుల్లోంచి వచ్చాయా మాటలు.

"అంత పెద్ద మాటలెందుకులే అన్నయ్యా. అవసరానికి ఆదుకోకపోతే అయిన వాళ్ళుం వుండి ప్రయోజనమేవిటీ!" అంది సుబ్బు.

ఇల్లంతా బోసి పోయినట్టు వుంది. అణువణువులో – నాలోనూ ఇంట్లోనూ – జీవం, చైతన్యం కోల్పోయిన భావన!

ఏవిటోగా అన్పించి ఒక రోజున సుబ్బుకి ఫోన్ చేశాను. "మంజుకేమైనా సంబంధాలు చూస్తున్నావా సుబ్బూ"

"పంతులు గారేవో తీసుకొస్తున్నారు గాని దీనికే నచ్చట్లేదు. నేనూ తనతో వుండాలని తిక్క పట్టు పడుతోంది. ఈ రోజుల్లో ఎవరొప్పుకుంటారు చెప్పు. నువ్వోమాట చెప్పి పుణ్యం కట్టుకో అన్నయ్యా. నీ మాట దానికి వేదవాక్కే"

"ఫోన్ దానికివ్వు చెబుతా"

లైన్లోకి మంజు వచ్చాక అన్నాను "నువ్వలా మంకుపట్టు పట్టడం ఏం బావో లేదు మంజూ. చూస్తోంటే మీ నాన్న మంకుతనమంతా నీ కొచ్చినట్టుంది..."

"అమ్మకార్చిన కన్నీళ్ళెన్నో నాకు తెలుసు మావయ్యా. అత్తింటి వారు గాని పుట్టింటి వారు గాని ఒక్కరూ ఆసరా రాకపోయినా ఒంటి చేత్తో నన్ను సాకింది. ఇంత దాన్ని చేసింది. ఇంకా ఒంటిగా బతుకునీడ్చమనెలా శపించగలను చెప్పు?"

"సెంటుమెంటుకన్నా జీవితం ముఖ్యం. కొడుకులే పేరెంట్స్‌ని దగ్గరుంచుకోవటం లేదు. ఇక అల్లుడికంత పెద్దమనస్సు వుండాలనుకోవడం అత్యాశే"

"సారీ మావయ్యా. అమ్మతో కలిసి వున్న జీవితమే నాకు కావాలి. అమ్మ లేనప్పుడు స్వర్గమైనా నాకొద్దు"

నాకు నోట మాట రాలేదు. ఎంత చక్కగా ఆలోచిస్తోందీ!

మంజుని చూడటానికి పెళ్లి వారొస్తున్నారు రమ్మంటే ఇద్దరం వెళ్ళేం. అబ్బాయి కాలేజీ లెక్చరర్. సన్నగా వున్నా బాగానే వున్నాడు. అతడి తల్లిదండ్రులు వ్యవసాయదారులు. వాళ్ళూ పద్ధతిగానే వున్నారు. సుబ్బు సంగతి ఎత్తాను.

"మంజుల చెప్పిందండి. మా అమ్మానాన్నా పల్లె వదలి రారు. అత్తయ్య మా దగ్గరుండటానికి నాకేం అభ్యంతరం లేదు"

'ఈ రోజుల్లో తప్పబుట్టాడు!' అభినందన పూర్వకంగా చూశాను.

మనస్సులో త్రాసు ఊగుతోంది. ఒక ప్రక్కన ఇతడు మరో ప్రక్క బాలాజీ. వూగి వూగి త్రాసు ఇతడి ప్రక్కకే తూగింది!

దగ్గరుండి పెళ్లి జరిపించాం. మంజుకీ సిటీలో ఉద్యోగం వచ్చింది. సుబ్బుని తీసుకొని హైదరాబాదెళ్లిపోయారు.

వెళ్తూ అంది మంజు "నువ్వూ అత్తయ్యా మా మొదటి అతిథులుగా రావాలి మావయ్యా"

నా కడుపు నిండి పోయింది. కళ్ళు చెమ్మగిల్లాయి. ఆమె తల మీద చెయ్యి వేశాను. ఏమని దీవించానో తెలీదు. బహుశా సిరిసంపదల్తో నూరేళ్ళు వర్థిల్లమని వుంటాను.

ఇల్లు, ఆఫీసు, తిండి, నిద్ర... రొటీన్ లైఫ్!

ఇది వరుకు కొడుకు గురించి రాబోయే కోడలి గురించి వారి సంసారం గురించి వారితో కలిసుండే రోజుల గురించి మేమిద్దరం ఎన్నెన్నో ఊహించుకునే వాళ్ళం. మరెన్నో చెప్పుకుని కలల్ని కలబోసుకుని కమ్మని నిద్ర పోయేవాళ్ళం.

ఇప్పుడు ఆకులు రాలిన వృక్షాలమై పోయాం. ఎప్పుడైనా మాట్లాడుకుంటే మంజు గురించే. ఎంత చిత్రం!

రెండ్రోజులు ఆఫీసు పని మీద క్యాంపు కెళ్లొచ్చాను. బెల్ కొట్టినా తలుపు తీయలేదు సీత.

తలుపులు బాదాను. ఇరుగు పొరుగు వచ్చారు. ఒంటరిగా వుంది. ఏమయ్యిందో ఎలా వుందోనన్న ఆందోళన నన్ను నిలువునా కుదిపేస్తోంది.

తలుపులు బద్దలు గొట్టారు. లోపల అచేతనంగా పడి వుంది. అంబులెన్స్‌లో హాస్పటల్‌కి తీసుకెళ్లాం.

సడన్‌గా బీపీ డౌన్ ఐపోవడంతో అన్‌కాన్షస్ అయ్యిందన్నారు. ఎలాగైనా సరే ప్రాణం పోయమనీ డబ్బుకోసం చూడొద్దనీ బ్రతిమాలాను.

వాళ్ళు డాక్టర్లు. దేవుళ్ళు కాదు. ప్రాణం పోయలేక పోయారు!

అంతా వచ్చారు. ఏడ్పులు ఓదార్పులు పరామర్శలు... కర్మకాండలు పూర్తయ్యాయి.

"కొన్నాళ్ళు తీర్థయాత్రలకు వెళ్ళి రండి నాన్నా. నాకు లీవు లేదు. శుభకీ కుదర్దు..."

కొడుకు వెళ్ళి పోయాడు. సీత తాలూకు నగలూ ఖరీదైన చీరలూ తీసుకుని కోడలూ వెళ్ళిపోయింది.

సుబ్బు, మంజు మిగిలారు.

నా తిండి పుష్టి ఎరిగిన సుబ్బు శుభ్రంగా వండి పెడుతోంది. కాని తినలేకపోతున్నాను. ఆకలి చచ్చి పోయింది.

సీత లేకుండా రాముడు బతగ్గలిగాడేమో. నాకు సాధ్యం కావట్లేదు. తలుచుకుంటే చాలు దుఃఖం పొంగి వస్తోంది!

ఆస్తులు డబ్బు బంగారం చీరలు... అంటూ బతికున్నన్నాళ్ళూ ఇద్దరం ప్రాకులాడాం. కడకేం పట్టుకెళ్ళింది! అది తెలీకే ఈ తపనలూ తాపత్రయాలూ ఆశలూ ఆరాటాలూ పరుగుళ్ళూ కుట్రలూ మోసాలూ లంచాలూ అవినీతీ...!

"అన్నీ తెలిసిన వారు. మీరిలా మీలో మీరు కుళ్ళి పోతే ఎలా మావయ్యా ధైర్యంగా వుండాలి. ఆఫీసుకెళ్ళండి. కొంతసేపైనా ఆ రంధిలో పడి అత్తయ్య జ్ఞాపకాలు మరచిపోతారు..."

"ఎలా మరచి పోగల్ను? ఒకటా రెండా ఇరవై ఎనిమిదేళ్ళ అనుబంధం!"

కన్నీళ్ళు పొంగి వచ్చాయి. తల తిప్పుకున్నాను. నిభాయించుకోక తప్పలేదు.

"మంజు వెళ్తానంటోంది. అవతల అల్లుడు గారు చెయ్యి కాల్చుకుంటున్నారు. నాకేం చెయ్యాలో తోచటం లేదన్నయ్యా"

ఏ విషయంలో - అన్నట్టు చూశాను.



[stamp]

"నాకూ వుండాలని వుంది. కాని మంజు వట్టి మనిషి కాదు. నాలుగో నెల..."

"అలాగా. చెప్పేవు కాదేం. నీ అవసరం నాకన్నా తనకే ఎక్కువ వుంది. ఒంటిగా బతకాలని రాసుంది. మొండిగా బతికేస్తాన్లే. మంజుతో నువ్వెళ్ళు..."

బజారుకెళ్లి రకరకాల స్వీట్లో కేజీ, నాలుగు రకాల పండ్లూ కొనుక్కొచ్చి మంజుకిచ్చాను,

నేనంత అభిమానం కురిపించడం ఇదే ప్రథమం అవడం వల్ల కాబోలు బావురు మంది మంజు.

ఓదార్చాను. వేదాంతం వల్లించాను. రైలెక్కించాను. నేనూ ఖాళీగూడూ మిగిలిపోయాం!

వంట కుదరటం లేదు. రుచులు అలవాటైన నోటికి చప్పగా ఉంటున్నాయి. హొటల్ టిక్కెట్లు తీశాను. డీసెంట్రీ పట్టుకుంది. ఎసిడిటీ, గ్యాస్ ట్రబుల్ మొదలయ్యాయి.

డాక్టర్ దగ్గరి కెళ్ళేను. ఎన్నో తినొద్దన్నాడు. ఒక్క మాటలో చెప్పాలంటే నోరు కుట్టేసుకోమన్నాడు.

ఇంట్లో ఒంటిగా వుండలేక పోతున్నాను. అర్థరాత్రుళ్ళు భయం వేస్తోంది. గుళ్ళకీ గోపురాలకీ తిరుగుతూ భగవద్గీత పఠిస్తూ...!

కొడుకు దగ్గరికెళ్లి నాలుగు రోజులుండొస్తే తెరిపిగా ఉంటుందని వుంది. కాని పిలవని పేరంటానికెలా వెళ్ళడం? ఫోన్లోనే దొరకని మనిషింటికి ఏ మొఖం పెట్టుకుని వెళ్ళగలను?!

మంజూ, వాళ్ళాయనా వచ్చారు.

"దేన్నైనా భరించొచ్చు గాని ఒంటరితనం భరించలేం మావయ్యా. భార్యకిభర్తా భర్తకి భార్యా తోడుగా నిలవాల్సిన అవసరం ముదిమిలోనే ఎక్కువ ఉంటుంది. నేనిలా అంటున్నానని ఏమీ అనుకోవద్దు. మళ్ళీ పెళ్ళి చేసుకోండి మావయ్యా"

"ఈ వయస్సులో!" పొడిగా నవ్వేను.

"ఇప్పుడే తోడు అవసరం ఎక్కువ. జీవితాంతం తోడుండటానికి జీవనసాహచర్యానికి కష్టం సుఖం పంచుకోవడానికి మంచి చెడూ చెప్పుకోడానికి..!"

"నీకిలాటి పిచ్చి ఆలోచనెలా వచ్చింది మంజూ"

"మీ పరిస్థితి గమనించాక! అమ్మ పడ్డ కష్టం తపన చూశాక!"

కథా నిలయం
6094
శ్రీకాకుళం

ఆమె ముఖంలోకి చూసి తలదించుకున్నాను.

"పెళ్లంటే ముక్కు పచ్చలారని అమ్మాయిని చేసుకోమని కాదు మావయ్యా. మీ లాంటి స్థితిలోనే వున్నావిడ్ని... ఇదిగో ఈ ఫోటో చూడండి. శివలక్ష్మి అనీ భర్త పోయి మూడేళ్ళయ్యింది. పిల్లలు ఎగిరిపోయారు. వృద్ధాశ్రమంలో వుంటోంది. మీ గురించి చెప్పి ఒప్పించాం..."

ఫోటో వంక చూళ్లేదు. మంజు వంక చూశాను.

ఎంత ఆప్యాయత! ఎంత అభిమానం! నా గుండెలు భరించలేక బ్రద్దలైపోతున్నాయి!

"నీకు చేయగలిగీ ఏమీ చేయలేక పోయాను. అయినా నేనంటే ఇంత ఆపేక్ష చూపిస్తున్నావు. ఎందుకు మంజూ?" జీరగొంతుతో ప్రశ్నించాను.

"అది నా బాధ్యత మావయ్యా. ఊహ తెలిసినప్పట్నుంచీ మీలో మా నాన్నని చూసుకుంటున్నాను..."

నా గుండెలు నిలువునా పగిలాయి. వేలాది ముక్కలయ్యాయి. 'మంజూ ! మంజూ!.....' మూగగా రోధించింది ప్రతి ముక్కా

కన్నీళ్ల ఉరికాయి. కన్నీటి ధారల్లోంచి మంజూనే చూస్తూండిపోయాను! ఎంత ఎత్తుకి ఎదిగిపోయింది!

"మావయ్య ఒప్పుకున్నారండీ" చిన్నపిల్లలా పొంగిపోయింది.

తనే బాలాజీకి ఫోన్ చేసి చెప్పింది. సరేనన్నాడు.

కాని మర్నాడు సూర్యనారాయణ వచ్చి ధుమధుమ లాడాడు.

"ఒక్కడే కొడుకని చేశాం. ఆస్తిపాస్తులన్నీ బాలాజీ పేరన రాసెయ్యండి. రేపు మళ్లీ సంతానం కలిగితే కష్టం. కీడెంచి మేలెంచమన్నారు..."

అతడి స్థానంలో నేనున్నా అంతే చేసేవాడ్నేమో! మనిషి ఆస్తి – డబ్బూ దస్కం బంగారం వెండి భూములూ మాత్రమే అన్ని నిన్నటి దాకా నేనూ నమ్మిన వాడ్నే!

"దస్తావేజులు తీసుకురండి రాసిచ్చేస్తాను..."

శివలక్ష్మి చట్ట ప్రకారం నా భార్య అయ్యింది.

సుబ్బుకి నాకిష్టం లేని సంబంధం చేస్తున్నారన్న కోపంతో తన పెళ్లి పనుల్లో కల్పించుకోలేదు. మేనమావనయ్యుండీ మంజుకి సంబంధాలు చూడలేదు. ఆమె పెళ్లికి

ఉత్సవ విగ్రహంలా నిలబడ్డామంతే.

కాని వాళ్ళిద్దరూ అన్నీ తామే ఐ నాకు మళ్ళీ పెళ్లి చేశారు. నా శేష జీవితంలో నవవసంతం రావడానికి కారకులయ్యారు.

చిత్రంగా నా ప్రపంచమూ మారిపోయింది.

ఇప్పుడు ఆస్తుల్ని గాక ఆప్తుల్ని లెక్కిస్తున్నాను. శివలక్ష్మి ద్వారా వృద్ధాశ్రమంలోని వారితో పరిచయం పెరిగింది. అభిమానం పెరిగింది. అనుబంధమూ పెరిగింది. నా ప్రపంచం 'నా' నుంచి 'మన' కు విస్తరించింది. మంచితనం, దయ, క్షమ, పరోపకారం. తపన, ఆర్తి – ఇవే మనిషి నిజమైన ఆస్తి పాస్తులని విశ్వసించేంతగా ఎదిగాను.

ఆర్థిక సంబంధాలకి గాక హార్దిక సంబంధాలకి విలువివ్వడం నేర్చుకున్నాను.

ఇప్పుడు నా గురించి తపించే గుండెలూ చెమ్మగిల్లే నయనాలూ ఎన్నున్నాయో లెక్కలేదు!

**(స్వాతి మాసపత్రిక మే 2013)**